# కుక్కపిల్ల

పులికంటి కృష్ణారెడ్డి

నడి వీధిలో పడ్డాడు అప్పన్న!

తనకు తానుగా పడలేదు.

అబ్బచేసిన చేతలకు అప్పన్న నడివీధిలో పడ్డాడు.

నడిమిట్టమీద పొద్దు. ఉచ్చి పీకుతూ ఉంది. దాహం వేసింది. ఊరికి దక్షిణంగా వున్న కొబ్బరినీళ్ళ కొలను మనసులో మెదిలింది. కొలనువైపు చూశాడు. కొలనుగట్టు-గట్టుమీద చలువరాతి బండలు-కొలనుకు తూర్పు దిశగా సత్రం-కంటపడ్డాయి. తుపుక్కున ఉమ్మాడు. గిరుక్కున వెనక్కు తిరిగాడు. ఇల్లు కంటపడింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆలోచిస్తూ ఎటో దృష్టి మరల్చాడు. ఊరి ముందర పొలాలు కనుపించాయి-కనుల పండువుగా:—కడుపు రగిలింది.

పేదవాడి కోపం పెదవికి చేటు!

ఏమీ చేయలేని స్థితి!

ఈ వయస్సులోనే తన కాళ్ళమీద తాను నిలబడ వలసిన గతి!!—

వంగి తన కాళ్ళ వైపు చూసుకొన్నాడు.

కాళ్ళముందర ఓ కుక్కపిల్ల!—

తన యింట్లో గొర్రెలమంద ఉన్నప్పుడు ఆ మంద వెంట తిరుగుతూ ఉండేది ఓ కుక్క. ఆ కుక్క ఈనింది. ఈనిన నెల తిరక్కముందే ఏ మాయదారి రోగమొచ్చిందో యేమో?—ఆ కుక్క చచ్చిపోయింది. తల్లి పాలకు, ఆదరణకు నోచుకోని ఆ కుక్క పిల్లలు ఒక్కొక్కటిగా జీవితాన్ని కడతేర్చుకొని వెళ్ళిపోతే-కడకు మిగిలింది ఒక్కగానొక్క కుక్కపిల్ల. కాళ్ళ ముందర నిలబడి ఉంది.

గొర్రెలమంద పోయింది. ఎద్దులు పోయాయి. ఆవులు పోయాయి. ఇల్లూ వాకిలీ పోయింది. పొలము పుట్రా పోయింది. కని పెంచిన తల్లీ దండ్రి పోయారు. కానీ—చిన్నప్పటి నుండి తాను విసిరేసింది తిని వెంట తిరిగిన కుక్కపిల్ల మాత్రం వదిలిపోలేదు.

అప్పన్న పెదవులపై ఓ చిరునవ్వు తొంగి చూసి తొలగి పోయింది!

నడి వీధిలో అలానే నిలబడ్డాడు అప్పన్న!....



అది ఒక పల్లె!

పల్లె పల్లెకూ ఓ పేరు ఉంటుంది. ఆ పల్లెకూ ఓ పేరు ఉంది. ఏమిటా పేరంటే?—కొజ్జా మొగుడు కోటలో ఉన్నా ఒకటే పేటలో ఉన్నా ఒకటే అన్నట్లు-ఆ పల్లె పేరు తెలుసుకొన్నా ఒకటే, తెలుసుకొనక పోయినా ఒకటే!!—

పోనీ-ఎక్కడుందాపల్లె? అదైనా తెలుసుకోవచ్చా? అని అంటే—

నిరభ్యంతరంగా!—

ఈ పవిత్ర భారతదేశంలోనే ఉంది.

ఎత్తయిన మేడల్ని-మత్తులో తూలే కన్నుల్ని-మెడమీద కంతల్ని

చూపించి-యివి మనం సాధించిన ప్రగతికి నిదర్శనాలు కావా? అని అడిగే ఓ ప్రబుద్ధిడికి-పైకప్పుకు పిడికెడు చెత్తకి నోచుకోని పూరి కొంపల్ని-కన్నీళ్ల కాపురం పెట్టిన చెంపల్ని చూపించి-మరి వీటినేమంటావ్?-అని సవాల్ చేయడానికి సాక్షాత్కరించినట్లుందా పల్లె!

ఆ పల్లెకు దక్షిణంగా ఓ కొలను ఉంది. ఆ కొలనులోనివి కొబ్బరినీళ్లు! అందులో విచ్చి వికసించిన తామరల్ని-వాటిమధ్య మూతి ముడుచుకున్న కలువల్ని-ఎర్రకలువల్ని చూడడానికి చాలవు కళ్ళు!....

ఆ కొలనుగట్టుమీద యేపుగా పెరిగిన చింతచెట్లు-వెలగచెట్లు-వేపచెట్లు ఉన్నాయి. వాటిక్రింద చలువరాతి బండలున్నాయి. "ఏ పుణ్యాత్ముడు పున్నెం కట్టుకొన్నాడో యేమో?" అని ఎండపొద్దున ఆ చలువరాతి బండలమీద కూలబడిన బాటసారులు అంటూ ఉంటారు. అయితే తద్వారా అతడెంత పున్నెం మూటగట్టుకొని పోయాడో, అంటున్నవాళ్ళకూ తెలియదు. వింటున్న వాళ్ళకూ తెలియదు.

ఆ కొలనుకు తూర్పుగా ఓ సత్రం. భవబంధాల విముక్తికై ఓ మనిషి చేసిన యత్నం! - ఫలించిందనుకొనేలోపలే అతని బ్రతుకు పండింది. అతడు భవబంధాల నుండి శాశ్వతంగా సెలవు దీసుకొని వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆ సత్రం గతి అంతే!

ఆ పల్లెలో ఆడవాళ్ళచేతి మగవాళ్ళున్నారు. మగ వాళ్ళ చేతి ఆడవాళ్ళున్నారు. అసలు సిసలైన మగవాళ్ళు ఉన్నారు. వీళ్ళందర్నీ తలదన్నే 'మగరాయుళ్ళు' ఉన్నారు.

ఆడవాళ్ళ చేతి మగవాళ్ళయినా—మగవాళ్ళచేతి ఆడవాళ్ళయినా—"ఆడమగ" "మగఆడ"లో అట్టే తేడా లుండవు కాబట్టి—వాళ్ళను గురించి ఆలోచించవలసిన అవసరంలేదు.

ఇక మగ రాయుళ్ళంటారా?—

పొద్దుపుట్టిబారెడెక్కక ముందే కొలను గట్టుపై చేరుతారు. కొలను గట్టున ఓచెట్టునీడలో టీ కొట్టు!— టీ కొట్టులో అందాల అలిమేలు. ఆమె చేతి టీకి రుచి ఎక్కువ. ఆప్యాయంగా తాగుతారు. అటుపై కొందరు చలువ రాతి బండలమీదికి, మరికొందరు సత్రంలోనికి చేరుకొంటారు.

చలువరాతి బండలమీద పులిజూదం—సత్రంలో పేకాట!—పంతాలమీద కొనసాగుతూ ఉంటుంది. ఆడే వాళ్ళు కొందరయితే ప్రక్కన కూర్చుని పై పందెం పాడే వాళ్ళుకొందరు. ఊరు మీద ఊరు పడవచ్చు. పొద్దుగూట్లో పడవచ్చు. అటు పులిజూదం కానీ — యిటు పేకాటకానీ ఆగడానికి మాత్రం వీల్లేదు.


ఈ మగరాయుళ్ళకు కన్నుకత్తరించడానికీ తెలుసు?

కన్నెచెర విడిపించడానికీ తెలుసు!;

టెంకాయలు కావచ్చు. అవి మిరవతోటల్లో వంకాయలు కావచ్చు. పెదతోటల్లో మామిడి కాయలు కావచ్చు. రెడ్డోరి నిమ్మతోటలో నిమ్మకాయలైనా కావచ్చు.








ఏకాపు కా కోపు!

మాటు మణిగితే చాలు. మనిషి మొగం మనిషికి కనుపించని చీకటి అలముకొంటే చాలు. పండిన పంట పొలాలమీద పడడమో? లేకుంటే—కాపు కొచ్చిన తోటలమీద పడడమో?-ఆ మగరాయుళ్ళకొక సరదా!

కోసు కొచ్చిన కాయలో—పులుము కొచ్చిన ధాన్యమో?—వీటైతే అలమేలు అంగడి చేరుతుంది. లేకుంటే సరాసరి అక్కడికి నాలుగు మైళ్ళ దూరాన వున్న పేట చేరుతుంది. అక్కడ చేతులు మారుతుంది. చేతులు మారడమంటే బేరం. అది ఒకటికి సగం బేరం. ఆ బేరంలో నాలుగు కాసులు మగరాయుళ్ళ చేతికందుతుంది. ఆ మరునాడు పులిజూదానికో పేకాటకో పెట్టుబడి అవుతుంది.

ఇక ఆ ఊళ్ళో అసలు సిసలైన మగవాళ్లన్నారు. వాళ్ళు ఎద్దులగొట్టి ముద్దలు తింటారు. వాళ్ళు దేశానికి వెన్నెముకలు.

ఈ అసలు సిసలైన మగవాళ్ళల్లో అప్పన్న ఒకడు!

ఈఅసలు సిసలైన మగవాళ్ళందరు ఎద్దులగొట్టి ముద్దలుతింటుంటే అప్పన్న కూడా అదే పని చేయాలి, అయితే అప్పన్నకు అరసెంటు భూమిలేదు.

అప్పన్న తండ్రి సుబ్బన్న. సుబ్బన్న ఆ పల్లెలో కాడెద్దుల సేద్యగాడు. మూడంకణాల పూరిల్లు—ఆ పూరింటి ముందర ఓ పసువుల కొట్టం, ఆ కొట్టంలో కాడి మెడమీద పెడితే ఖణిల్లని రంకె వేసే జోడు గిత్తలు—పూటకు రెండు ముంతల పాలు పిదిగే రెండు పాడి ఆవులు—ఇంటి వెనుక యింటికి తగినంత ఖాళీ జాగా-ఆజాగాలో ఓమంద గొర్రెలు!-

సుబ్బన్న మోతుబరి రైతంటే కాదంటారు.

"సుబ్బన్న కేఁవుందిలే!" అంటే ఒప్పుకోరు!

సుబ్బన్న పెళ్ళాం గంగులమ్మ. చుక్కలాంటి మనిషి. అటు పొలానికి వెళ్ళినా — యిటు యింటి దగ్గరైనా వాళ్ళిద్దరూ కూడా మాడా పనిచేస్తు కొంటుంటే చూడ ముచ్చటగా ఉంటుంది.

ఆమె యింటి ముందు కళ్ళాపు చల్లుతూంటే అతడు పేడదిబ్బకెత్తుతాడు.

ఆతడు కపిల కడితే ఆమె పార చేత పట్టుతుంది.

అతడు పడక దున్నుతూంటే ఆమె పెద్ద పెద్ద పిట్టలు పగుల గొడుతూంటుంది.

రెండు బార్ల పొద్దెక్కక ముందే పొలం పనులు ముగిస్తారు. రెండు బార్ల పొద్దెక్కేసరికి యిల్లు చేరుతారు. ఒకరు ఆవుల పాలుపిండుతూంటే యింకొకరు గొర్రెల పాలు పిదుకుతారు. ఆమె పాల చెంబు చేతపట్టి అలివేలు అంగడికి వెళుతుంది. అతడు గొర్రెల మంద వెంటపడతాడు.

తగులుతున్నా తడుముకొనక పోవడమనేది ధైర్యవంతుడి లక్షణం. భారత దేశం చాలా ధైర్యవంతమయింది. ఎన్నెన్ని ఎదురు దెబ్బలు తగులుతున్నా తడుముకోకుండా ముందుకే పోతూంది. ముప్పై కోట్ల జనాభా అరవై కోట్లకు దాటించి. అన్నింటి కంటే యిది చాలా పెద్దదెబ్బ. అయినా లెక్క చేయడంలేదు. ఇప్పుడిప్పుడే ఆలోచన మాత్రం నామమాత్రంగా ఆరంభమయింది. మే మిద్దరు — మాకు ముగ్గురా? లేక యిద్దరా? అన్నమీమాంసలో పడింది.

కానీ మే మిద్దరు మాకు ఒక్కడే! అన్నాడు సుబ్బన్న!

అప్పన్న అల్లారు ముద్దుగా పెరుగుతున్నాడు.

కడివెడు పాలు చెడిపోవడానికి ఓ ఉప్పుకల్లుచాలు!

పొంగుతున్న సంసారం పొయ్యి పాలు కావడానికి ఏమాత్రం యేమరుపాటైనాచాలు!!

గొర్రెల కాచుకొంటూ బండల మీద కూర్చుని ఉబుసు పోకకు నేర్చుకొన్న పులి జూదం సుబ్బన్నను గుంట కట్టమీద చలువబండల మీదికి చేర్చింది.

జూదంలో అతడు "పులి" అనిపించుకొంటూ, ఒక్కొక్క మెట్టు పైకెక్కుతున్నాడు. అతడి సాంసారిక పరిస్థితి మెట్టు మెట్టుగా కిందికి దిగుతూ ఉంది.


గొర్రెల మేపడానికి మనిషిలేక సుబ్బన్న మందను అమ్మకానికి పెట్టాడు. ఆ మాట చెవిని పడ్డ గంగులమ్మ కుయ్యో! మొర్రో!! అనిమొత్తుకొనింది. పులి జూదం మోజులో తల మునకలవుతున్న సుబ్బన్న ఆలి మాటల్ని ఆలకించడానికి, ఆ స్కారం లేక పోయింది. రుచి తెలియని వాళ్ళకు చెప్పినా లాభం లేదనుకొన్నాడు. తన అభిరుచి తనదను కొన్నాడు.

గొర్రెలమంద "రెడ్డోరి" మందలో కలిసి పోయింది.

సుబ్బన్న చేతిలో నాలుగు కాసులు








మెదులుతున్నాయి. ఆ హుషారులో సుబ్బన్న మకాం చలువబండలమీది నుండి సత్రానికి మారింది. ఇప్పుడు చింతగింజలకు బదులు వింతవింత రంగుల యిస్పెట్టాకులు సుబ్బన్న చేతిలో తిరుగుతున్నాయి.

సుబ్బన్న చేతికి పైసలు చింతగింజల్లా వచ్చిన్నట్లు వస్తున్నాయి. పోతున్నాయి.

ఓడిపోతూనే ఉంటే ఆడడమంత అందగించదేమో కానీ-గెలుస్తూ ఓడుతూ ఉంటే ఆ మజానే వేరు. సుబ్బన్నకు పెళ్ళాం పిల్లలు-యిల్లు వాకిలీ ఏమీ కనుపించడమేలేదు. ఒకవేళ కనుపించినా కన్నెర్ర చేస్తున్నాడు. కానీ ఆటలో కావలసిన ఆకు చేతికందితే అందలమెక్కినంత కాదు-ఆట గెలిచినంత సంబరపడిపోతున్నాడు.

గంగులమ్మ విషమిస్తున్న పరిస్థితుల్ని గమనించింది. భవిష్యత్తును గురించి ఆలోచించింది. ఒక్కగానొక్క బిడ్డను అక్కున చేర్చుకొని ఒంటరిగా కూర్చొని యేడ్చింది. వాడి భవిష్యత్తును తలపోసి కలవరపడింది. కనీసం వాడికోసమైనా మనిషిగా బ్రతకడానికి నిశ్చయించుకొనింది.

ఆ మరుసటిరోజే ఓ సేద్యగాడిని కుదిరించుకొనింది. ఆయన యింటికంటూ వస్తే వేళకింత తిండి పెడదామని నిర్ణయించుకొనింది. ఆ యింటికి ఆడామగా తానే అయినట్లు యిటు యింట్లో అటు పొలంలో రాత్రింబవళ్లు అటు కూర్చొనడంలేదు. ఇటు నిలబడడంలేదు.

ఓరోజు రెండుబారల పొద్దెక్కింది. అప్పుడే గంగులమ్మ పొలంనుండి

తిరిగి వచ్చింది. కడపలో కాలుబెడుతూ కాలటు యిటు కదపలేకుండా నిలబడి పోయింది!

భుజాన బండీ కదురుగోలు-చేతిలో ఎద్దుల పగ్గాలు అలానే ఉన్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తుంటే ఆమె కడుపులో దేవినట్లయింది. కండ్లు తిరుగుతున్నాయి. ఇల్లు తలక్రిందు లవుతూ ఉంది. నిలబడడం కష్టమనిపిస్తూ ఉంది. చేతిలో పగ్గాలు చేజారిపోతున్నాయి. భుజాన బండీకదురుగోలు జారి కాలిమీద పడ్డాయి.

ఆమె కుప్పగా కూలిపోయింది!

ఆ యింటి కామధేనువులు కన్నీళ్ళతో కదిలిపోతున్నాయి!

సుబ్బన్న తిరిగి చూడకుండా గుంట కట్ట ఎక్కుతున్నాడు!

కుప్పగా కూలిపోయిన గంగులమ్మను ఎవరో పైకి లేపారు. పైకి లేస్తే తనకు తానుగా లేవాలికానీ-ఒకరు లేపితే ఎంత వరకు?-మంచంమీది వరకు!

మనోవ్యాధికి మందు లేదు.

ఆమె మళ్ళీ పైకి లేవలేదు.

సుబ్బన్న అప్పుడప్పుడు ఈ లోకంలోనికి వస్తున్నాడు. వచ్చినపుడు మాత్రం ఓ క్షణం మంచానికి కరచుకొన్న పెళ్లాన్ని-కంచంముందు కూర్చుని అరుస్తున్న కొడుకునుగురించి ఆలోచిస్తాడు. బాధ కలుగుతుంది. బాధోపశమనానికి మందు. అదే పుచ్చుకొంటాడు-గవర్నమెంటు సారాయి కొట్లో! మళ్లీ అదే లోకానికి వెళ్లిపోతాడు.

సుబ్బన్న ఈ లోకంలో మనిషిగా జీవిస్తూ ఆ లోకంలో పడి ఆడుతున్నపుడు ఓడుతూ ఉండేవాడు. ఓడినదానికంటే ఎక్కువగా గెలిచేవాడు. కానీ ఆ లోకంలోనే మనిషిగా మిగిల్పినపుడు ఓడిపోవడమే ఎక్కువయింది.

ఓడిపోతూంటే బాధ. బాధకు విరుగుడు మందు. మందుతో బాధ విరుగుడైతే ఆనందం. ఆనందంలో మళ్లీ ఆట. ఆడితే మళ్లీ ఓటమి. ఓడితే చేతిలో డబ్బుండదు. డబ్బు లేకపోతే ఆట కొనసాగదు. ఎలాగైనా ఆడాలి. ఆడాలంటే డబ్బు కావాలి. ఆస్తిని అమ్ముతూ పోతే వస్తూ ఉంటుంది డబ్బు. అయితే తవ్వుతూ పోతే కొండలైనా తరిగిపోయినట్లు అమ్ముతూ పోతే ఆస్తులు హరించుకుపోవడం ఎంతసేపు?

సుబ్బన్న జీవితంలో పూర్తిగా ఓడిపోయాడు.

మనోవ్యాధితో మంచమెక్కి తల్లి పోయింది.


తాగితాగి తండ్రి తల్లికి తోడుగా వెళ్ళిపోయాడు!!

అప్పన్న వీధిలో పడ్డాడు. అప్పుడతని వయస్సు పదిహేనేండ్లు.

"ఒరే! పొద్దుగూకులూ యిట్లా ఈ సెట్లకింద కుచ్చోని ఆడతావుంటే-రేపెట్లా బతకపోతావ్రా! - మణుసులుగా పుత్తే సరా?-సిగ్గూ సీవూ ఉండక్కల్లా?"

గుంటకట్టమీద బాధ్యత బాధపడుతూ ఉంది!-ఆ మాటలు అప్పన్న చెవిని పడ్డాయి.

"అవును. ఇక్కడ నిలబడి గెంటల తరబడి ఆలోచిస్తావుంటే ఆకలికి పరిష్కారం దొరుకుతుందా?"-ఆలోచించాడు అప్పన్న.




దొరకదన్నట్లు తల అడ్డంగా ఊగింది!

అందుకే బయలుదేరాడు ఆ చిన్నవాడు.

వంచిన తల ఎత్తకుండా ఊరికి ఉత్తరంగా నడిచాడు. దారి సాగినంత దూరం నడిచి ఆగిన చోట నిలబడ్డాడు. నిలబడి తల పైకెత్తి చూశాడు. ఎదురుగా కొండలు. పల్లెకు కోట గోడల్లా ఎత్తయిన కొండలు!—ఆ కొండలమీద పడ్డాడు. కొన్ని చేతికి దొరికాయి. మరి కొన్నింటిని చెట్టెక్కి విరిచాడు. అన్నీ ఎండు పుల్లలు. ఓ మోపు గట్టాడు. నెత్తికెత్తుకొన్నాడు. ఊరివైపు బయలుదేరాడు.

నీడలా వెన్నంటి వస్తూనే ఉంది కుక్కపిల్ల!

ఊరికి ఉత్తరంగా ఓ పెద్దబావి. ఆ బావి గట్టున ఓ కానుగ చెట్టు. ఆ చెట్టు బోదెకు మోపును ఆనించాడు. మెడ విరుచుకొన్నాడు. చేతకాని పని. అలవాటు లేదు. కాళ్ళు నిలబడడం లేదు. చెట్టుక్రింద చేరగిలపడ్డాడు. ఆ బాధను చూడలేనన్నట్లుగా కుక్కపిల్ల 'కుయ్యో! కుయ్యో!!' మంటూ ప్రక్కకు ఒదిగింది. ఒదిగిన కుక్కపిల్లను ఆప్యాయంగా గుండెలకు హత్తుకొన్నాడు అప్పన్న!

కట్టెలు తెమ్మని ఎవరూ అడగలేదు. ఎవరికి అవసరమో కూడా తెలియదు. ఒక్కగానొక్క కొడుకు ఉద్యోగాలుచేసి ఊళ్ళేలవలెనని ఆశించిన తల్లిముదిగారంతో సేద్యం చేయడానికి వళ్ళు వంగలేదు. కట్టెలు తేవడానికి కడుపు పూడడానికి సంబంధ

పుందని మాత్రం ఆలోచించగలిగాడు. తీరా తెచ్చిన తరువాత ఎలా చేయాలో తోచలేదు.

తనకంటే నిస్సహాయంగా తన వైపు చూస్తూ ఉంది కుక్కపిల్ల!

అప్పన్న నిమురుతూ ఉంటే ఏదో ఆలోచన వచ్చినట్లు ఎగిరిపడిలేచింది కుక్కపిల్ల. అతని జుట్టు నోటగరచి లాగుతూ ఉంది. అసలే అలసిసొలసి వున్న అప్పన్నకు కోపం వచ్చింది. విదిలించి కొట్టాడు. కానీ అది అదిరి పోలేదు. బెదిరి పోలేదు. జుట్టు వదలి పెట్టి మొలగుడ్డను పట్టి లాగుతూఉంది. ఏమీ తోచక అప్పన్న విసుక్కొన్నాడు. అదికాళ్ళమీదపడి వేడుకొన్నట్లు చూస్తూ ఉంది. కాళ్ళు నాకుతూ ఉంది. దాని తపన అర్థంకాక దానివైపు చూస్తుంటే మళ్ళీ మొలగుడ్డను పట్టి ముందుకు లాగుతూ ఉంది. దాని పోరుపడలేక పైకి లేచాడు అప్పన్న. కట్టెల మోపు నెత్తికెత్తుకొన్నాడు.

ఇంత వరకు వెంటపడిన కుక్కపిల్ల యిప్పుడు ముందు నడుస్తూఉంది!

దాని తీరుకు ఆశ్చర్యపడుతూ అప్పన్న దాని వెంటపడ్డాడు. అది నేరుగా 'రెడ్డోరి' యింటికి దారి తీసింది. దొడ్డి గుమ్మంవైపు లోన దూరింది. అప్పన్న దాని వెంటపడి నడుస్తూనే ఉన్నాడు.

రెడ్డోరి మిద్దింటి వెనుక ఓపినంత ఖాళీ జాగా ఉంది. అక్కడే పశువుల కొట్టాలున్నాయి. ఆనుకొని పెరడు ఉంది. పెరడు ప్రక్కనే పెద్ద పెద్ద వేడినీళ్ళ కాగులు అమర్చిన పొయ్యిలున్నాయి. అక్కడ నిలబడింది కుక్కపిల్ల. తోకాడిస్తూ....'కుయ్యో కుయ్యో!' మని అరుస్తూ అతని కాళ్ళ చుట్టూ తిరుగుతూ మూతిని పాదాలమీద రుద్దుతూ ఉంది.

అప్పన్న నెత్తిమీద మోపును దభీమని నేలవేశాడు.

ఆ శబ్దం విన్న రెడ్డెమ్మ ఆదరా బాదరా పెరట్లోకి వచ్చింది. ఓ క్షణం విస్తుపోతూ నిలబడింది. ఆ తరువాత 'అయ్యో పాపం! నువ్వా నాయనా!' అని సానుభూతిని ప్రకటించింది. ఇంటిలోనికి వెళ్ళి ఓ ముద్ద సంకటిని తెచ్చి అప్పన్నచేత పెడుతూ "ఎట్లాంటి వాళ్ళకెట్లాంటి కష్టం వొచ్చిందిరా దేవుడా!" అని వాపోయింది.

అప్పన్న పెద్దబావి గట్టుమీదికి వెళ్ళాడు. కానుగ చెట్టు నీడలో కూర్చున్నాడు. కుక్కపిల్లకంత పెట్టాడు. తానంత తిన్నాడు. ప్రాణం తేలిక పడింది.

ప్రతిరోజు అడవికి పోతున్నాడు. కట్టెలు తెస్తున్నాడు. ఏ యింట్లోనో ఒక యింట్లో తనకు యిష్టమైన యింట్లో వేస్తున్నాడు. వాళ్ళు ఇంతపెడితే తింటున్నాడు. పెద్దబావి గట్టున కానుగచెట్టు నీడలో తలదాచుకొంటున్నాడు. కుక్కపిల్ల ఆతని పక్కలో ముడుక్కొంటూ ఉంది.

ఇప్పుడు ఊళ్ళో అందరు అప్పన్నను గురించి మాట్లాడే వాళ్ళే!

"వాడి ఈడు పిల్లకాయలు తేరకు తిని తిరిగ్గా గుంట కట్ట మీద జూదంవాడతా వుంటే—వాడు కట్టెలు తెచ్చి పొట్ట





పోసుకుంటున్నాడు. వాడూ బిడ్డంటే!"

ఈ మాట బోడెబ్బ చెవిని పడింది!

బోడెబ్బ అప్పన్నకు వేలు విడిచిన మేనమామ! — నలుగురు ఆడ బిడ్డల తండ్రి.

"ఎవరి నోట్లో యిన్నా ఒకటే మాట! — 'అప్పన్న ఎంత మంచోడు! ఎంత మంచోడు!' అని. ఏఁవిలేక పొయ్యినా గుణవొకటుంటే అన్నీ వున్నట్టే! చేరదీస్తే నేదోడు వాదోడుగా వుంటాడు. ఆ తరవాత దేఁవుడు మేలు జేస్తే ఒక బొళవూ తీరిపోతుంది!" - మేనమామ మేనల్లుణ్ణి గురించి ఆలోచించాడు.

ఆలోచించడమే తరువాయి. ఓరోజు సందకాడ పని గట్టుకొని వెళ్ళాడు.

కానుగ చెట్టు బోదెకు చేరగిలబడి అప్పన్న కుక్క పిల్లతో ఆడుకొంటున్నాడు. మామను చూస్తూనే ఎగిరిపడి లేచాడు. అప్పటికి అదేదో తన యిల్లయినటు— అ యింట్లో మామగారికి అతిధి మర్యాదలు జరుపవలసిన బాధ్యత నెత్తినున్నట్లు — 'కూర్చో మాఁవయ్యా!' అన్నాడు.

బోడెబ్బ ఆ చెట్టు కింద ఓ రాతి మీద రారాజులా కూర్చున్నాడు.

"సూడప్పన్నా! నేను బతికుండగానే నువ్విట్లా సెట్ల కింద బతకడం నాకేదో బాధగానే వుండాది. నా బిడ్డల్లో ఒక బిడ్డ అనుకుంటా. నేను తినేది నీకింత పెడతా. ఇంటికి వచ్చేయ్ నాయినా!" — అన్నాడు.

అదో రకంగా నవ్వాడు అప్పన్న!

"ఎందుకురా నవ్వుతుండావ్? — నా మాట మీద నీకు నమ్మకం కుదర్లేదా? పచ్చని సెట్టు కింద కుచ్చోని సెప్తా వుండా!" — నమ్మించడానికి ప్రయత్నించాడు బోడెబ్బ.

"అదేఁవీ లేదు మాఁవయ్యా! మీరంటున్న మాటలు అనడానికి బాగున్నాయి. వినడానికంతకంటే బాగున్నాయి. అయితే జరగడం మాత్రం కల్ల. జరగదని తెలిసి కూడా తలపోసుకోవడం తలకాయ నొప్పి! - అట్లా జరిగేటట్లయితే చెట్టు కిందికేం కర్మ? - అప్పుడే మీ ఇంటికి వచ్చేవాణ్ణి! - నన్నిట్లానే బతకనీయండి మాఁవయ్యా!" — అన్నాడు.

అదీ నిజమనుకొన్నాడు బోడెబ్బ. మారుపలుక లేదు.

మౌనంగా లేచి వెళ్ళిపోతున్న మామగారి వైపు అప్పన్న అలానే చూస్తూ వుండి పోయాడు.

చూస్తూ చూస్తూ వుండగానే కానుగ చెట్టు రెండు సార్లు దిస మొలతో నిలబడి-నలుగురు చూచి నవ్విపోతారని భయపడి-పచ్చని చీర కట్టుకొని పండు ముత్తయిదువలా తయారయింది.

ఇప్పుడు అప్పన్న చేతికి ఓ కత్తి వచ్చింది. చంకకొక సొరకాయ బుర్ర వచ్చింది. కాళ్ళకు జత చెప్పులు వచ్చాయి. అడవిలో ధైర్యంగా వెళ్ళగలిగినంతదూరం వెళ్ళగలుగుతున్నాడు. ఏ కట్టె మండుతుందో, ఏ కట్టెలయితే తొందరగా వెల పోతాయో - అప్పన్న బాగా తెలుసుకొన్నాడు.

పుట్ట మీదనో, చెట్టు మీదనో నిలబడి అతడు కట్టెలు కొట్టుతుంటాడు.

అల్లంత దూరంలో నిలబడుతుంది కుక్క. అతడి వైపు దీనంగా చూస్తూ వుంటుంది. కొట్టిన కట్టెల్ని మోపు కట్టుకోవడానికి ఓ చోట చేరవేస్తుంటాడు. అది గూడ ఓ కట్టెను నోట కరచుకొని తెస్తుంది. అతడు మోపు నెత్తికెత్తు కొంటే దారి చూపుతున్నట్లుగా ముందు నడుస్తుంది. అలసి సొలసి మధ్యే మార్గంలో ఏ చెట్టు నీడలోనో మోపు దించి అలా ఆ చెట్టు నీడలో వాలబడితే-ముందరి కాళ్ల రెండూ ఎత్తి రొమ్ము మీద పెట్టి మూతిలో మూతిపెట్టి ముదిగారం చేస్తుంది.

కష్టపడుతున్న తనని చూసి ఓ సానుభూతి వాక్యం పలకడానికి తల్లి లేదు. కష్టసుఖాల్ని పాలు పంచుకొనడానికి అన్నలు లేరు. తమ్ముళ్ళు లేరు. అక్కచెల్లెండ్రు అసలే లేరు. వెంట ఉన్నది ఓ జంతువు. దానికి నోరు లేదు. మనసులోని భావానికి మాటరాదు.

ఈ భావన మనసులో మెదిలేసరికి ఆతని గుండె ద్రవిస్తుంది. కళ్లు చెమ్మగిల్లుతాయి. చూడలేనన్నట్లుగా అది ఆతని రొమ్ముమీదనుండి కాళ్ళను దించేస్తుంది. తల వంచి మెలికలు తిరిగిపోతూ "కుయ్యో! కుయ్యో!"మంటూ ఆ చెట్టుచుట్టూ తిరుగాడుతుంది.

"ఏదో ఒక బంధం లేకపోతే బ్రతుక్కు అందమే ఉండదేమో?"-అనిపిస్తుంది అలాంటి సమయాల్లో అప్పన్నకు!

"ఆ సమయం కూడా ఆసన్నమయిందిరా నాయినా!" అంటూ ఓరోజు బోడెబ్బ అప్పన్నను వెతుక్కుంటూ వచ్చాడు. కష్టాన్నినమ్ముకొన్న మనిషిని నమ్ముకుంటే నష్టముండదని బోడెబ్బ అభిప్రాయపడినట్లుంది.

"అప్పన్నా! ఎంతకాలమని యిట్లా వొంటిబతుకు బతకతావు నాయినా! నా మాటిను. ఇంటికొచ్చేయ్!-ఇంటికి రమ్మంటూఉండానంటే ఏదో పనీపాట సెయ్యడానికిగాదు. నా అల్లుడుగా రా!" అభ్యర్థించాడు బోడెబ్బ.

ఆ మాటలు వింటుంటే అప్పన్నకు డబ్బు విలువ తెలిసివచ్చింది.

"మామయ్యా! నాకా దిక్కూ దరీ లేదు. తల దాచుకోవడానికి జానెడు కొంప లేదు. కట్టెలమ్ముకుంటే కడుపు పూడతా వుంది. నన్ను అల్లుణ్నిగా చేసుకుంటానంటే నా చెవుల్ని నేనే నమ్మలేకపోతున్నాను. నీ కూతుర్ని పువ్వుల్లో పెట్టి పూజించుకుంటా! కానీ పువ్వుల్లో పెట్టి పూజించుకుంటానన్నా యిల్లరికం మాత్రం రాలేను మామయ్యా!

పొంగిపోయాడు బోడెబ్బ-అల్లుడు సంపన్నుడు కాకపోయినా అభిమాన సంపన్నుడని!

కానుగచెట్టు తెల్లని పువ్వుల్ని పలపల రాల్చింది!


కట్టెలమ్మేవాడిచేత తాళి కట్టించుకోవడానికి కాంతమ్మ మనస్సు కష్టపడింది.

పల్లెలో పుట్టి-పల్లెలోనే పెరిగిన పడుచు! పల్లెత్తు మాట పలకలేదు!

కాంతమ్మ, అప్పన్నా ఓ శుభగడియలో ఆలూమగలైనారు!

ఊరికి చివరగా ఓ పూరి గుడిసెలో






కాపురం పెట్టారు.

అప్పన్న బాధ్యత పెరిగింది. కానీ బ్రతుకుతెరువు మారలేదు.

కోడికూతతో నిద్ర లేస్తాడు. ఇప్పుడు సొరకాయ బుర్రకు ఓ'సిక్కం' తోడయింది. కాంతమ్మ సిక్కంలో అంత సంకటి కట్టిస్తుంది. 'సొరకాయ బుర్ర' 'సిక్కం'-భుజాన వ్రేలాడుతుంటాయి. కత్తి చేతిలో ఉంటుంది. కుక్క వెంట ఉంటుంది. అడవికి బయలుదేరుతాడు. అడవిలో వెదకివెదకి మంచి చేవదేరిన కట్టెల్ని కొట్టుకుంటాడు. మోపు కట్టేటపుడు అందమైన పెళ్లాం మొగం మనసులో మెదులుతుంది. ఆ మొగంలో ఓ చిరునవ్వు చూడాలంటే నాలుగు కాసులు ఎక్కువగా సంపాదించాలి. అందంగా కడతాడు మోపు. ఇప్పుడు అప్పన్న బేరం పల్లెనుండి పేటకు ఎదిగింది. కాంతమ్మ కట్టిచ్చిన కవళాన్ని ఎండపొద్దున యే బావిగట్టునో కూర్చుని తిని అటునుండి అటే అడ్డుదారిపట్టి పేట చేరుతాడు. కట్టెలమ్ముకుంటాడు. పొద్దు గూట్లో పడేసరికి యిల్లు చేరుతాడు. వచ్చిన డబ్బును పైసలతోసహా కాంతమ్మ చేతుల్లో పోస్తాడు!

కానీ కాంతమ్మకు యేదో వెలితి?-

తన బ్రతుకు ఆ గుండు గుడిసెకే కుదించుకపోయిందని తపన!

ఇరుగు పొరుగు యింతకంటే ఎంతో హీనంగా బ్రతుకుతున్నా తనది వాళ్ళకంటే యింకా హీనమైన బ్రతుకని తనకు తనకే సందేహం!

బ్రతికినంత బ్రతుకు బ్రతికి కడకు కట్టెలముకొనేవాడితో కాపురమా అన్న ఆవేదన!!

ఎంత కప్పి పుచ్చుకున్నా వీటి ప్రభావం ఎప్పుడో ఒకప్పుడు అప్పన్న మీద పడుతూనే వుండేది. ఆ మాత్రం గ్రహించలేని అమాయకుడేమీ కాదు అప్పన్న. ఏ సమస్య అయినా కాలం చేతిలో పెట్టడం మంచిదన్న అభి

ప్రాయంతో నోరు కదిపేవాడు కాదు. పైగా మామగారికి మాట యిచ్చాడు- పువ్వుల్లో పెట్టి పూజించుకుంటానని!- ఓర్పు మంచిదే!-అయితే అమితమైన ఓర్పు బలహీనత క్రింద లెక్కకెక్కుతుంది. ఒకసారి లెక్క కెక్కిం దంటే—చెల్లుబడడం మహా కష్టం.

అప్పన్న విషయంలో అక్షరాలా అంతే జరిగింది.

కాంతమ్మ కారణం లేకనే చీటికి మాటికీ ఈసడించు కోవడానికి అలవాటు పడిపోయింది.

అతడి కెప్పుడూ అడవిలోనే పొద్దు మొలిచేది. ఊళ్ళోనే పొద్దు కుంకేది. పొద్దు మొలిచి కుంకే లోపుగా అతడి ఆవజీవాలు అణగి పోతాయి. అప్పుడట్లా నాలుగు ముంతల వేడి నీళ్లు వొంటి మీద జారపోసు కుంటాడు. ఇంత ఎంగిలిపడతాడు. నులక మంచం మీద నడుము వాలుస్తూ వుంటే-కాంతమ్మ పాఠం ఆరంభిస్తుంది,

"ఏం బతుకో!....యిరం పరంలేని బతుకు! - ఒక మంచీ లేదు. సెడ్డా లేదు. ఇరుగు పొరుగు అమ్మలక్కలు టింగు రంగా అని సింగారించుకొని వారానికొక సారైనా పోతా వుంటారు. పేటకు సిల్మాకని!-సిలమాలేదు. గిలమా లేదు. వండుకునేది. తినేది. పొణుకునేది. ఇంతే ఈ బతుక్కు!"

అలవాటయే కొద్దీ ఆవేశం తగ్గిపోయేటట్లుంది!

అప్పన్న బెల్లం కొట్టిన రాయిలా వుండడానికి అలవాటు పడిపోయాడు.

పెద్ద బావి గట్టున కానుగ చెట్టు పాత చీరల్ని విప్పి కొత్త చీరల్ని కడుతూనే వుంది.

ఓ రోజు—

అప్పన్న యింటికి రావడానికి చాలా ఆలస్యమయింది.

ఆ రోజు ఎంత తిరిగినా పేటలో అమ్మబోతే అడవిగా తయారయింది పరిస్థితి. తిరిగి తిరిగి విసిగి పోయాడు అప్పన్న. ఎవరికో ఒకరికి ధార పోసే సరికి పేటలోనే కను చీకటి ఆవరించింది. ఆలస్యమయి పోయిందను కొంటూనే అప్పన్న ఇంటికి వచ్చాడు. ఇంట్లో కాలు పెడుతూనే కాలు గిరడానికి సిద్ధంగా నిలబడి వుంది కాంతమ్మ. ఓక్షణం ఆమెను గమనించాడు. ఎన్నడూ లేనిది ఆమె అందంగా అలంకరించుకుని వుంది.

సందేహంగా చూస్తూ అప్పన్న అలానే నిలబడి పోయాడు!

"ఎందుకట్లా కదిలీ మెదల కుండా మాను మాదిరి నిలబడుకున్నావే?"- రెట్టించింది కాంతమ్మ.

"మరేం జెయ్యమంటావ్?"—

అలసి సొలసిన ప్రాణం. ఎక్కడ లేని విసుగు. ఒక్క మాట వెలువడింది చాలా కాలానికి.

నువ్వేఁవీ సెయ్యాల్సిన పని లేదు. పెళ్ళో నీళ్ళు కాగతా వుంటాయి. మూకిట్లో అంత సంకటేసి పెట్నాను. తిను. పొణుకో!-ఈదినాటక వంట. నేను పొయ్యి సూసేసొస్తా!"

నోట్లో మాట నోట్లోనే వుంది.

కాంతమ్మ కడపదాటి పోతూ వుంది.

తనలో తాను నవ్వుకున్నాడు అప్పన్న. ఆ తరువాత అక్కడ నుండి కదిలాడు.



కాంతమ్మ అమ్మలక్కలతో చేరింది. ఏదో చెర నుండి విముక్తి పొందినట్లుందామెకు. ఆమె ఆనందానికి అవధులే లేవు. నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ తూలుతూ పేలుతూ ఏదో స్వర్గ సుఖాన్ని చవి చూడబోతున్నట్లు వెళ్ళింది నాటకం చూడడానికి!—

సతీ సావిత్రి నాటకం!

కాంతమ్మ అక్కడ చేరే సరికి ఊరు ఊరంతా అక్కడే ఉంది. కూర్చోవడానికి కాసంత చోటు సంపాదించుకోవడమే కష్టమైపోయింది. ఎలాగో వాళ్ళను వీళ్ళను బ్రతిమలాడి తంటాలు పడింది. చంకలోని గోనెపట్ట పరచి కూర్చొనింది.

నాటకం ఆరంభమయింది.

సత్యవంతుడు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చి జీవిస్తున్నాడు.

"ఇది బలే బాగుందే!—యింటి కంటే గుడి బద్రవనుకుంటే అదిగూడ ఆడికే ఉందే!—రామేశ్వరంపొయ్‌నా శనేశ్వరం వదల్లేదంట. ఈడకూడా కట్టెల యాపారమేనా?"

అనలేదుకానీ అనుకొనింది కాంతమ్మ.

కానీ సావిత్రి భర్తను దైవ సమానంగా పూజిస్తూ ఉంది. అతనికి సకలోపచారాలు స్వయంగా నెరవేరుస్తూ ఉంది. వాళ్ళు ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు.

కాంతమ్మకు ఏదో ఎబ్బెట్టుగా తోస్తూ ఉంది. నాటకం జరిగేకొద్దీ ఆమెకు ఆశ్చర్యం కలుగుతూవుంది.

ఓ రోజు సత్యవంతుడు అడవికి వెళ్లాడు. ఆ రోజే యముడు అతని ప్రాణాల్ని తీసుకొనిపోతాడు. సావిత్రి మహా పతివ్రత. ముందుగానే ఈ సంగతిని పసిగట్టింది. పతిభిక్ష పెట్టమని యముణ్ణి వెంటాడింది "ఏ మాత్రం ప్రయోజనం లేదు. తిరిగి వెళ్ళిపో!" అంటున్నాడు యముడు. కానీ సావిత్రి పట్టు వదలడంలేదు.

రాళ్ళు రప్పలు ముండ్ల పొదలతో నిండిన అడవిదారి. కాలుదీసి కాలూనడానికి వీలులేదు. యముడేమో దర్జాగా దున్నపోతుమీద వెళ్లుతున్నాడు. సావిత్రి దేనినీ లెక్క చేయడంలేదు. అలాంటి దారి వెంబడే యముణ్ణి వెంటాడుతూ ఉంది. గుట్టల్ని, పుట్టల్ని-కొండల్ని కోనల్ని-దాటి పోతూనే ఉంది. యముడు వారిస్తూనే ఉన్నాడు. అయినా సావిత్రి వదలడంలేదు.

కట్టెలమ్మి పొట్టపోసుకునే మనిషి కోసం సాటి ఆడది పడుతున్న అవస్థను గమనించేసరికి కాంతమ్మ బుర్ర గిర్రున తిరుగుతూ ఉంది. కుదురుగా కూర్చొనలేకపోతూంది. క్షణక్షణానికి తన బ్రతుకు కొట్టవచ్చినట్లు కంటెదుట కనపడుతూ ఉంది.

"కోడి కూసే యాళకాడ లేస్తాడు. గుక్కెడు సద్దినీళ్ళు గొంతులో పోసుకుంటాడు. అడివి మీద పడతాడు. నడ్డినీలిగే మోపు తలకెత్తుకొంటాడు. పేటదాక నడుస్తాడు. అక్కడ దించమన్నచోట దించి-వద్దన్నచోట తలకెత్తి కన్నగసాట్లు పడితేగదా కడుపు

కంతతిండి!—కడపదాటకుండా చూసు కుంటా ఉండాదే! అంత మంచి మణి సికి అంత తిండి కూడపెట్టకుండా నేనే(వో ముక్కలదాక మెక్కి వచ్చే శానే పాపిష్టిదాన్ని!—నేనూ ఆడదే! తానూ ఆడదే! అయితే కూడ ఆ ఆడది మొగుడికోసం ఎన్నగసాట్లు పడతావుంది. నేనే(వో!"—ఎన్నడూ లేని విధంగా కాంతమ్మ మనస్సు కల వరపడింది.

చివాలున పైకి లేచింది కాంతమ్మ!

"అప్పుడే లేస్తావుండావెందుకే?- ఇంకనేగదా వుండేదంతా ఆట!— సావిత్రి అత్తమా(వలకు కండ్లు తెప్పించుకోవాల, పోగొట్టుకున్న రాజ్యాన్ని పొందల్ల! మొగుణ్ణి బతికించుకోవాల!—ఇంకా యింతాటుంటే అప్పుడే లేసినావే! కూర్చో!"—సతీ సావిత్రి నాటకం తెలిసిన ఓ ఆవిడ సలహాయిచ్చింది.

అదేమీ కాంతమ్మ చెవికెక్కడం లేదు.

సంచివట్ట మడచి చంకలో పెట్టుకొనింది,

ఒక్క ఊపులో యిల్లు చేరింది.

కంటపడిన దృశ్యంతో కదిలీమెదల కుండా నిలబడిపోయింది.

గుడిసెలో గుంజకు ఆనుకున్నాడు అప్పన్న. అలసి సొలసిన ప్రాణం. ఆనుకున్నవాడు ఆనుకున్నట్లే నిద్రపోతున్నాడు. అతడిముందు మూకుట్లో సంకటి చల్లబడిపోయింది. చల్లబడిన సంకటిమీద ఈగలు ముసురుతున్నాయి.

ఎప్పుడో సంధకాడ వెలిగించిన బుడ్డీ దీపం.కొండెక్కడానికి సిద్ధంగా ఉంది.

అప్పన్న కుక్క-

మూకుడు ముందర ముందరి కాళ్లు బారసాచి పడుకునివుంది.

సూటిగా అతని మొగంలోనికి చూస్తూ వొగిలిస్తూ ఉంది.

ఆ వొగిలింపులో తపన ఉంది.

ఆ చూపుల్లో ఆశ ఉంది.

ఎగిరెగిరి పడుతున్న ఎండిన డొక్కల్లో ఆకలి గూడుకట్టుకొనిఉంది. యజమాని తింటే తనకంత వేస్తాడని ఎదురు చూస్తూ ఉంది.

అది దాని నమ్మకం!

అప్పన్న తినలేదు! అదీ తినలేదు!!

అలికిడైతే ఎగిరిపడి మొరిగే కుక్క!

కాసంత కవళం కంటపడితే ఎగరేసుకపోయే కుక్క!!

యజమాని తినలేదన్న తపనలో మునిగి ఉంది.

విశ్వాసంలో ఏకాగ్రత!

మూకుట్లో వేసిన సంకటిని తినడానికి కూడ ఓపిక లేక అలానే గుంజకు చేరగిలబడి నిద్రపోతున్న భర్తను చూసింది కాంతమ్మ.

ఆమె గుండె బాధగా మూలిగింది!


యజమాని తినలేదని తానూ తినకుండా తపిస్తూ ఎదురు చూస్తున్న కుక్కను చూసింది.

ఆమె కళ్ళల్లో పలపల నీళ్లు రాలాయి!

*







## ఆర్కెష్ట్రా రిహార్సల్ :

ఇది ఇటలీ చిత్రం. ఫెడిరికో ఫెలినీ ఈ చిత్రానికి దర్శకుడు-

ప్రతి దేశంలోనూ రాజకీయ, సామాజిక అసమానతలు, సమన్వయం లేక పోడాన్ని సాహిత్య పరంగా ఎంతో చెప్పారు-చదివాము. కానీ సినిమాల్లో ఆ విషయాన్ని సింబాలిక్‌గా చెబుతూ నిర్మించిన చిత్రాలు బహు కొద్ది ..

ఐతే ఈ చిత్రం యావత్తూ ఓ పెద్ద "సింబల్" అనవచ్చు. అనార్కిజాన్ని, అపసవ్యమైన జీవిత విధానంలోని ఖంగాళీ అవకతవకలని పైకి చెబుతున్న రంగుల సంకేతమే ఈ సినిమా.

రకరకాల మనస్తత్వాలతో, వివిధ భావాలతో అవస్థపడుతున్న కొందరు వాయిద్య కళాకారుల సమ్మేళనం అది- నారి "రిహార్సల్" ఓ పురాతనమైన చర్చిలో ఏర్పాటయింది. ప్రతి వ్యవస్థకీ, ప్రతి దేశానికీ అది సంకేతం. అసమానంగానూ, అసంగతంగానూ, విచక్షణ తెలీకుండా, సమన్వయం

జనవరిలో, ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించబడ్డ చిత్రాల మీద మరికొన్ని సంక్షిప్త సమీక్షలను మా పాఠకుల సౌకర్యార్థం యిక్కడ ప్రచురిస్తున్నాము. -ఎడిటర్